క్లుప్తంగా

పీఏసీఎస్ అటెండర్ మృతి

నివాళి అర్పించిన చైర్మన్, సభ్యులు

యాచారం: పీఏసీఎస్‌లో పనిచేసిన అటెండర్ రాములు సేవలు మర్చిపోలేమని చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాములు శుక్రవారం తన స్వగ్రామం నానక్‌నగర్‌లో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాజేందర్‌రెడ్డితో పాటు సంఘం సీఈఓ నాగరాజు, పలు గ్రామాల పీఏసీఎస్ డైరెక్టర్లు నానక్‌నగర్‌కు వెళ్లి రాములు మృతదేహానికి నివాళులర్పించారు. రాములు అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు. డీసీసీబీ ఉన్నతాధికారులతో మాట్లాడి మరింత సహాయం అందేలా కృషిచేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు.

తలకొండపల్లి జీపీ కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

తలకొండపల్లి: తలకొండపల్లి గ్రామ పంచాయతీ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పంచాయతీ జిల్లా కార్యదర్శి పాండు, ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జల్లెల పెంటయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జంగయ్య, కార్యదర్శిగా యాదమ్మ, కోశాధికారిగా శివలీల, యాదయ్య, అలివేలు, వెంకటయ్య, బాలమ్మ, పాండు, లాలును కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ధ్రువపత్రాలు అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌కు చెందిన శ్రీరాములు (60) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు శ్రీశైలం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, తిరుపతి, రామచంద్రయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వెల్జాల్‌కు చెందిన..

మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన యశోద (54) అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందింది. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.6,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అజీజ్, రాజు, విష్ణు, మాలు, చెన్నయ్య, యాదయ్య, పెంటయ్య, జంగయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు జీతాలివ్వండి

తలకొండపల్లి: గ్రామ పంచాయతీ సిబ్బందికి తక్షణమే జీతాలు విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ వర్కర్స్, అండ్ సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ఎంపీఓ రఘుకు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ జీతాలను విడుదల చేయాలని కోరారు. ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య, జిల్లా కార్యదర్శి పాండు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ శ్రేణులు

మంచాల: భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డిని మంచాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం నగరంలో కలిసి ఘనంగా సన్మానించారు. మండలాని పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, జయానందం, మాజీ సర్పంచ్‌లు రమాకాంత్‌రెడ్డి, జంగయ్య, యాదయ్య, మండల నాయకులు మాసయ్యగౌడ్, రాములు పాల్గొన్నారు.

గ్రూప్-1కు ప్రత్యేక బస్సులు

ఇబ్రహీంపట్నం: ఆదివారం జరిగే గ్రూప్-1 పరీక్షలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ నర్సప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలల్లో సుమారు 30 మందికి పైగా గ్రూప్-1 పరీక్షలు రాసే అభ్యర్థులుంటే తమకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. వారి గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులను ఎగ్జామ్స్ సెంటర్ల వరకు నడిపిస్తామని వెల్లడించారు. దీనికి ప్రత్యేక చార్జీలుంటాయన్నారు. పూర్తి సమాచారం కోసం 99592 26141 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

‘ఇంటికి వంద.. బడికి చందా’

- ఆదర్శంగా నిలుస్తున్న మజీద్‌పూర్ జెడ్పీహెచ్ఎస్
- ప్రధానోపాధ్యాయుడి ప్రత్యేక కృషి
- గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అభివృద్ధి



మజీద్‌పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు, శిథిలావస్థ భవనాలు, అపరిశుభ్ర వాతావరణం ఉంటుందని ఒకప్పటి మాట.. ప్రస్తుతం ఓ ప్రభుత్వ పాఠశాలను చూస్తే మాత్రం అలాంటి భావన ఎవరికీ రాదు. ‘ఇంటికి వంద-బడికి చందా’ అనే నినాదంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీసుకున్న నిర్ణయం.. గ్రామస్తులను ఏకం చేసి పాఠశాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టిని సైతం ఆకర్షించింది. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఆ పాఠశాలనే అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మజీద్‌పూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఒకప్పుడు రంగులు వెలసిన పాత గోడలతో దర్శనమిచ్చే పాఠశాల గోడలను.. ప్రస్తుతం దేశంలోని ప్రముఖుల చిత్రాలతో పెయింటింగ్ చేయించారు. పాఠశాల ముఖద్వారం మొదలుకుని ఆవరణలోని స్టేజీ, ఆ పక్కనే గౌతమ బుద్ధుడు, సరస్వతీ విగ్రహాలను ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను గ్రామస్తులు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి సమకూర్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలంటే అందరికీ మక్కువ ఉండే రీతిలో తీర్చిదిద్దారు.

అందరి భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధి

గ్రామస్తులందరి తోడ్పాటుతోనే పాఠశాల అభివృద్ధి సాధ్యమైంది. రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, విద్యాకమిటీ సభ్యులందరూ ఒక్కతాటిపైకి వచ్చి గ్రామంలోని పాఠశాలను అభివృద్ధి చేశారు. పదవ తరగతి ఫలితాల్లో ఇక్కడి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. భవిష్యత్‌లోనూ మంచి ఫలితాలు సాధిస్తాం. తాజాగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి సహకారంతో పాఠశాల గోడలకు రంగులు వేయించాం. తోడ్పాటునందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

– విజయభాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

పేద విద్యార్థులకు అండగా ఆర్యవైశ్య సంఘం

- సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్

ఆమనగల్లు: ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ సూచించారు. నీట్ పరీక్షలో 637 మార్కులు సాధించిన ఆమనగల్లుకు చెందిన విద్యార్థిని పాపిశెట్టి దుర్గను పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. రామ్మోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. విద్యార్థులకు భవిష్యత్‌లో సహకారం అందిస్తామన్నారు. వాసవీ ఎడ్యుకేషన్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు డాక్టర్ శ్రీనివాస్, నర్సింహ, నటరాజ్, యాదయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య, విద్యార్థిని, తల్లిదండ్రులు, అరవింద్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

హనుమంత్‌నాయక్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: గురుకుల విద్యాలయాల అడిషనల్ సెక్రటరీ, గ్రూప్-1 అధికారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమంత్‌నాయక్ పుట్టిన రోజు సందర్భంగా బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బజారు భిక్షపతి శుక్రవారం ఘనంగా సన్మానించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషిచేయడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న హనుమంత్‌నాయక్ తన ఉద్యోగ జీవితంలో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. ఆ సంఘం నాయకులు శ్రీనివాస్, ఆంజనేయులు, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



హనుమంత్‌నాయక్‌ను సన్మానించిన భిక్షపతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న డీఎస్‌పీ నాయకులు

‘రాజ చిహ్నం’ నమూనా ఆమోదించాలి

- మండల కోకన్వీనర్ గూడూరు భాస్కర్

కందుకూరు: తమ పార్టీ ప్రతిపాదిస్తున్న తెలంగాణ రాష్ట్ర రాజ చిహ్నం నమూనాను పరిశీలించి ఆమోదించేలా చొరవ తీసుకోవాలని డీఎస్‌పీ(ధర్మసమాజ్ పార్టీ) మండల కోకన్వీనర్ గూడూరు భాస్కర్ శుక్రవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్‌పీ జిల్లా కన్వీనర్ గుండ్రపల్లి అమరేందర్ మాట్లాడా రు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తెలంగాణ చిహ్నాన్ని మార్చాలని నిర్ణయం తీసుకోవడాన్ని తమ పార్టీ స్వాగతిస్తుందన్నారు. కొత్తగా తయారు చేసే చిహ్నంలో తాము సూచిస్తున్న విధంగా ఉస్మానియా యూనివర్సిటీ, రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ అంబేడ్కర్, అణగారిన వర్గాల కోసం పోరాటం చేసిన పండగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమక్క, సారలమ్మల చిత్రాలను ఉంచాలన్నారు. దీంతో అది అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని కోరారు. ఈ కార్యక్రమంలో మహిపాల్, ఎర్ర ప్రవీణ్, ఓటు లక్ష్మయ్య, చిన్నగళ్ల అంజయ్య పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల విషయంలో ఫిర్యాదు



కందుకూరు పీఎస్ ఎదుట నినదిస్తున్న బేగంపేట వాసులు

- న్యాయం చేయాలని దళితుల వేడుకోలు

కందుకూరు: ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ఇళ్లు, తాము పశువుల కోసం ఏర్పాటు చేసుకున్న పాకలను, తమదేనంటు కొందరు అక్రమంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ బేగంపేటకు చెందిన దళితులు శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కందుకూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముచ్చర్ల నర్సింహ, కంద పెద్ద నర్సింహతో పాటు బాధితులు మాట్లాడారు. 60–70 ఏళ్లుగా గ్రామంలో ఇళ్లు నిర్మించుకుని ఆ పక్కనే పశువుల దొడ్లు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నామన్నారు. ఇప్పుడు గ్రామానికి చెందిన అండేకార్ ఆనంద్ కుటుంబీకులు ఇళ్లు ఖా ళీ చేయాలని బెదిరిస్తున్నారని ఆరోపించా రు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కో రారు. ఈ కార్యక్రమంలో కొమ్మగళ్ల నర్సింహ మాదిగ, గుల్వి దేవేందర్‌మాదిగ, కె.జంగయ్యమాదిగ, ఎం.భాస్కర్‌మాదిగ, గుండ్రపల్లి మహేష్‌మాదిగ, ఫిర్యాదుదారులు మైసమ్మ, బుచ్చమ్మ, శంకర్, ఏసయ్య, శ్రీను, రవి, సా యి, రాజు, రాము లమ్మ, శంకరమ్మ, కమలమ్మ, యాదమ్మ, జంగయ్య పాల్గొన్నారు.

పంచాయతీ భూములను కాపాడండి

- వెంచర్లల్లో పదిశాతం స్థలం రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
- విద్యుత్ సమస్యల పరిష్కారణకు ప్రణాళిక ఉందా?
- విత్తనాలు, ఎరువుల సరఫరాపై ఇంత నిర్లక్ష్యమా..
- అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు
- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం: మండల పరిధిలోని పంచాయతీల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లల్లో నింబంధనల ప్రకారం పంచాయతీల పేర్లమీద చేస్తున్న పదిశాతం రిజిస్ట్రేషన్ల భూములు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు పంచాయతీ అధికారులపై మండిపడ్డారు. ఎంపీపీ కొప్పు సుకన్య అధ్యక్షతన శుక్రవారం యాచారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ సుకన్యతో పాటు వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు ఈదులకంటి లక్ష్మీపతిగౌడ్.. మండల పంచాయతీ అధికారి ఉమారాణిపై తీవ్రంగా మండిపడ్డారు. మండల పరిధిలోని యాచారం, మాల్, నందివనపర్తి, గునుగల్, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, చింతుల్ల, చౌదర్‌పల్లి, చింతపట్ల తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో హెచ్ఎండీఏ, డీటీసీపీ వెంచర్లు ఏర్పాటయ్యాయని..రియల్ వ్యాపారులు నింబంధనల ప్రకారం గ్రామ పంచాయతీల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసి పదిశాతం భూములు ఏమైనట్లు, గుర్తిస్తున్నారా.. ప్రహరీ నిర్మించి, పంచాయతీ బోర్డులు ఎందుకు పెట్టడం లేదని ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు సభలో ప్రస్తావించారు. వెంచర్లల్లో ఉన్న 10% భూమిని గుర్తించి పంచాయతీ బోర్డులు ఏర్పాటు చేయాలని, రిజిస్ట్రేషన్లకు సంబంధించి డాక్యుమెంట్లను పంచాయతీల్లోనే భద్రపర్చాలని మండల పంచాయతీ అధికారి ఉమారాణికి సూచించారు.

డాక్యుమెంట్లు తొలగించినట్లు ఫిర్యాదులు

కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు కుమ్మక్కై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను తొలగించినట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. గతంలో పలు గ్రామాల్లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేవని జిల్లా పంచాయతీ అధికారులు, జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదులు అందిన విషయాన్ని సభలో గుర్తు చేశారు. విలువైన పంచాయతీ స్థలాలను కాపాడలేకపోతే ఏం చేస్తున్నట్లు అంటూ మండిపడ్డారు. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గ్రామాలవారీగా రిజిస్ట్రేషన్ భూములను గుర్తించి ప్రజల సమక్షంలోనే బోర్డులు ఏర్పాటు చేస్తామని మండల పంచాయతీ అధికారి సభ దృష్టికి తీసుకువచ్చారు.

ఐదేళ్లు సహకరించినందుకు ధన్యవాదాలు

ఐదేళ్ల పదవీ కాలంలో ఎంపీటీసీ సభ్యులకు సహకరించిన అధికారులకు, ప్రజలకు ధన్యావాదాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. ఐదేళ్ల కాలంలో ఎన్ని కష్టాలు వచ్చినా.. ప్రజల వైపే ఉన్నామని అన్నారు. తాజా ఎంపీటీసీ సభ్యులకు ఇదే చివరి మండల పరిషత్ సర్వసభ్యసమావేశం కావడంతో ఎంపీపీ ఈవిధంగా మాట్లాడారు. ప్రజలకు సేవ చేసే విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఉంటేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, చింతపట్ల, మాల్ ఎంపీటీసీ సభ్యులు లక్ష్మమ్మ, ఇస్రత్‌బేగం, ఎంపీడీఓ నరేందర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

వర్షాలు కురుస్తున్నాయి, గ్రామాల్లో విద్యుత్ వ్యవస్థ దారుణంగా మారింది. చేతికందే ఎత్తులోనే విద్యుత్ వైర్లు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు లేవు. రైతులు, ప్రజల ప్రాణాలు పోతేగాని విద్యుత్ అధికారులు స్పందించరా అంటు ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు మండల విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్‌పై మండిపడ్డారు. గునుగల్, యాచారం, గడ్డమల్లయ్యగూడ, నల్లవెల్లి తదితర గ్రామాల్లో అనేక విద్యుత్ సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈజీఎస్ నిధుల నుంచి ప్రతి యేటా రూ.కోట్లాది నిధులతో హరితహారంలో భాగంగా రోడ్ల వెంట నాటిన మొక్కలు చెట్లుగా మారుతున్న తరుణంలో విద్యుత్ సిబ్బంది మరమ్మతుల నేపథ్యంలో వాటిని నరికివేస్తున్నారని సభ్యులు ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాలో ఇబ్బందులు రానియవద్దని సూచించారు. రైతుబంధు నిధులు త్వరగా అందేలా ఉన్నదాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వ్యవసాయాధికారి సందీప్‌కుమార్‌కు సూచించారు.

పిల్లలను బడిలో చేర్పిద్దాం

- ఎంఈఓ సర్దార్ నాయక్
- కొనసాగుతున్న బడిబాట

మాడ్గుల: మండలంలోని ఇర్విన్, నల్లావారిపల్లి, అవురుపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఏంఈఓ సర్దార్ నాయక్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గ్రామస్తులు, అధికారులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీని నిర్వాహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం శ్రీధర్, రాజు, శ్రీశైలం, పర్వాతాలు, సింహాచలం, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

యాచారం మండలంలో..

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని వారి తల్లిదండ్రులను ప్రభుత్వ ఉపాధ్యాయులు కోరారు. యాచారం, చింతపట్ల, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను రూ.లక్షలాది ఫీజులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే బదులు మెరుగైన విద్య అందే ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ కోరారు. చర్లపటేల్ గూడలో బడిబాట ర్యాలీ, మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీలో వారు పాల్గొన్నారు. అదేవిధంగా కర్ణంగూడలో విద్యార్థులకు యూనిఫాం స్టిచ్చింగ్ కేంద్రాన్ని, నర్సరీలను సందర్శించి తగు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఎంపీటీసీ ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ మైసయ్య, చర్లపటేల్‌గూడ స్పెషల్ ఆఫీసర్ శాంతిశ్రీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నోములలో కరపత్రాల పంపిణీ

మంచాల: మండలంలోని నోములలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తారి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జయానందం, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాడ్గుల: ర్యాలీలో పాల్గొన్న ఏంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు



యాచారం: కుర్మిద్దలో బడిబాట ర్యాలీ



ఇబ్రహీంపట్నం: బడిబాట ర్యాలీలో ఎంపీపీ కృపేశ్, ఉపాధ్యాయులు



ఇబ్రహీంపట్నం: కర్ణంగూడలో యూనిఫాం కుట్టు కేంద్రాన్ని సందర్శించిన నాయకులు



మంచాల: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సమావేశంలో చైర్మన్ అబ్దుల్లా సాది, పాలకమండలి సభ్యులు

వర్షాకాలానికి ప్రణాళిక సిద్ధం

పారిశుద్ధ్య పనులకు రూ.54లక్షలు మంజూరు

- బక్రీద్ నిర్వహణకు రూ.10లక్షలు
- ఆమోదం తెలిపిన జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, పాలక మండలి

పహాడీషరీఫ్: వర్షాకాలం, బక్రీద్ పండుగ సందర్భంగా వ్యర్థాల సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది తెలిపారు. మాన్సూన్ ఎమర్జెన్సీ, పండుగల నేపథ్యంలో జల్‌పల్లి మున్సిపాలిటీ పాలక మండలి శుక్రవారం చైర్మన్ అధ్యక్షతన సమావేశమయ్యింది. కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి పర్యవేక్షణలో భూగర్భ డ్రైనేజీ క్లినింగ్ కోసం మిషన్ల ఎంగేజ్, పారిశుద్ధ్య నిర్వహణకు జేసీబీలు, డోజర్, ట్రాక్టర్లు, కార్మికులను తీసుకునేందుకు రూ.35లక్షల నిధులు ఖర్చు పెట్టేందుకు పాలక మండలి ఆమోదం తెలిపింది. దీంతో పాటు 28 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సామగ్రి, ఫాగింగ్ మిషన్లు, ఆయిల్ బాల్స్, సిబ్బందికి రక్షణ వస్తువులు లాంటి వాటి కోసం రూ.19 లక్షలు కేటాయించనున్నారు. బక్రీద్ పురస్కరించుకొని ఖుర్బానీ వ్యర్థాలు వేయడానికి ప్లాస్టిక్ పెద్ద కవర్ల కొనుగోలు, వ్యర్థాలను తొలగించడానికి జేసీబీ, ట్రాక్టర్లు, కార్మికులను ఎంగేజ్ చేయడానికి రూ.10 లక్షలు ఖర్చు చేయనున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ప్రజలు మున్సిపాలిటీ తరఫున అందజేసిన కవర్లలో వ్యర్థాలను వేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా అత్యవసర సమయంలో స్పందించేందుకు అన్ని రకాలుగా సిబ్బందిని సిద్ధం చేశామని తెలిపారు. వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కౌన్సిలర్లు కెంచె లక్ష్మీనారాయణ, దిల్రూబా హసన్ షా, జాఫర్ ఖాన్, ముజ్జార్ అలీ, శంషూద్దీన్, ఖాలేద్ మహరూస్, షేక్ ఫమిదా అఫ్జల్, ఆర్వో సుదర్శన్, మేనేజర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు..

శ్రీశైలం ప్రధాన రహదారిలోని ఎర్రకుంటలో గోతులమయమైన రోడ్డు మరమ్మతుల కోసం రూ.6 లక్షలు కేటాయించారు. ఈ రహదారికి ఇరువైపులా మురుగు వెళ్లకుండామోరీల నిర్మాణం చేసినప్పటికీ రోడ్డు మరమ్మతులు చేసేందుకు ఆర్ అండ్ బి అధికారులు ముందుకు రావడం లేదని చైర్మన్ తెలిపారు. వాహనదారులకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తాము ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.